ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 06 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 23 | పేజీలు: 4 వెల: 5



## హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

- రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఏఐ మౌలిక వసతుల ప్రాజెక్టు
- 250 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ క్యాంపస్
- ఏఐ విప్లవంలో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలబెడతాం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 7 వేల ఉద్యోగాల కల్పన
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడింది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

3

రేవంత్‌తో వ్యక్తిగత
## వైరం లేదు

- ఒకట్రెండు అంశాల్లోనే అభిప్రాయ భేదాలు వచ్చాయి
- మునుగోడుకు కొడంగల్, మధిర స్థాయిలో రూ.2 వేల కోట్ల నిధులు
- త్వరలో సీఎం సభకు వేలాది మంది కార్యకర్తలతో వెళ్తా
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



3

## ఎవరిని పడితే వారిని పార్టీలోకి చేర్చుకోం

- కాంగ్రెస్ సంక్షోభాన్ని కప్పిపుచ్చేందుకే ఇలాంటి కథనాలు
- తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే ప్రత్యామ్నాయం
- బీజేపీ సీనియర్ నేత మురళీధర్‌రావు
- కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న ప్రచారంపై క్లారిటీ



2




## కేసీఆర్.. దమ్ముంటే
# అసెంబ్లీకి రా!
## 1000 రోజుల పాలనపై చర్చకు సిద్ధం

రైతులు, మహిళలు, యువతకు చేసిన మేలుపై లెక్కలు చెబుతాం

కేసీఆర్ కుటుంబ పాలనకు.. ఇందిరమ్మ రాజ్యానికి తేడా ఇదే

సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

కేసీఆర్ సిద్ధంగా ఉండు.. ఎన్నికల్లో తేల్చుకుందాం

నకిరేకల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి సవాల్



కాకతీయ,తెలంగాణ బ్యూరో / నకిరేకల్ : నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని మరోసారి రుజువైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నకిరేకల్ కాంగ్రెస్ ఖిల్లా అని వేలాది మంది తరలివచ్చిన వేముల వీరేశం బహిరంగ సభ నిరూపించిందన్నారు. కాంగ్రెస్ కోసం ప్రాణాలర్పించే కార్యకర్తలతోపాటు ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆశీర్వదించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు,

........(తరువాయి 2లో)

# ఇనుగాలకు అవమానం
## కుడా మాజీ చైర్మన్‌కు నో ఫేర్‌వెల్

- ఆఘ మేఘాల మీద నూతన చైర్‌పర్సన్ చేత ప్రమాణం
- గుండు సుధారాణి ప్రమాణ స్వీకారానికి దూరంగా వెంకట్రాంరెడ్డి
- పాత టీడీపీ నేతలంతా జిల్లా కాంగ్రెస్‌లో ఒక్కటవుతున్నారని పార్టీ వర్గాల్లో చర్చ
- పార్టీని పట్టుకుని ఏళ్లుగా ఉంటున్న నేతలకు అవమానాలే మిగులుతున్నాయనే ఆరోపణలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముదురుతున్న అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్ రాజకీయ వివాదం
- ప్రచారానికి అనుగుణంగా కీలక నేతల చర్యలు
- కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల హవా
- అధిష్ఠానంలోని కీలక నేతల మద్దతు వారికేనంటూ పాత క్యాడర్ మండిపాటు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' రాజకీయ వివాదం మరోసారి తెరపైకి వస్తోంది. కుడా చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రాం రెడ్డి పదవీకాలం ముగిసిన వెంటనే గుండు సుధారాణిని కొత్త చైర్‌పర్సన్‌గా నియమించడం.. ఆఘమేఘాలపై ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మాజీ చైర్మన్‌కు కనీసం వీడ్కోలు కార్యక్రమం కూడా నిర్వహించకపోవడం, కొత్త చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి వెంకట్రాంరెడ్డి దూరంగా ఉండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పదవి మార్పు సాధారణ పరిపాలనా ప్రక్రియే అయినా.. అందుకు అనుసరించిన తీరు మాత్రం పార్టీ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీసింది.

**పాతవారికి ప్రాధాన్యం ఎక్కడ?**

కాంగ్రెస్‌ను నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేసిన నేతలకు

........(తరువాయి 2లో)

# పాలు లేకుండానే పన్నీర్ తయారీ
## 3 డెయిరీల లైసెన్సులు సస్పెండ్

- టన్ను పామాయిల్, 475 కిలోల రసాయనం స్వాధీనం
- రూ.7.19 లక్షల విలువైన పదార్థాలు సీజ్
- హైదరాబాద్‌లో కల్తీ ఆహారంపై అధికారుల కొరడా







**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కల్తీ రాయుళ్ల దందాలకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా హైదరాబాద్‌లో పాలు లేకుండానే రసాయనాలతో పన్నీర్ తయారు చేస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ దారుణం బయటపడింది. పన్నీర్ తయారీ కేంద్రాల్లో కనీస పరిశుభ్రత కూడా పాటించకపోవడం, బొద్దింకలు, ఈగలతో కూడిన అపరిశుభ్ర వాతావరణంలో ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు, హెచ్‌ఫాస్ట్ అధికారులతో కూడిన 12 బృందాలు హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంతోపాటు నగర పరిసర జిల్లాల్లోని డెయిరీ ఉత్పత్తుల కేంద్రాలు, రిటైల్ యూనిట్లపై మెరుపు దాడులు నిర్వహించాయి. పన్నీర్ తయారీకి



పాలను సేకరించినట్లు చూపించే ఎలాంటి వివరాలు, రికార్డులు కూడా ఆయా కేంద్రాల్లో లేకపోవడం గమనార్హం. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్న డెయిరీలపై అధికారులు కొరడా ఝులిపించారు. లక్ష్మీఫుడ్స్, ధనలక్ష్మీ డెయిరీ, నటరాజ్ మిల్క్ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఆయా కేంద్రాల్లో తక్షణమే

........(తరువాయి 2లో)

- ఇసుక లారీలే టార్గెట్‌గా నెలవారీ మామూళ్లు...?
- లారీకి 7,500 చొప్పున డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు
- డబ్బులు ఇస్తేనే లారీ కదులుడు.. లేకుంటే భారీ జరిమానాలు
- నిబంధనలకు విరుద్ధంగా 'టెంపరరీ' నంబర్ ప్లేట్ల వినియోగం
- ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా.. మరో ఎంవీఐకి ఓడీపై విధులు ?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

# రవాణా శాఖలో మరో వసూళ్ల దందా!



కాకతీయ, ములుగు ప్రతినిధి : ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వ్యవహారాలు ఒక్కొక్కటిగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇప్పటికే సెలవులో ఉన్న అధికారి పేరుతో లాగిన్ వినియోగించి డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారన్న ఆరోపణలపై వివాదం కొనసాగుతుండగానే.. తాజాగా ఇసుక లారీల తనిఖీల పేరుతో జరుగుతున్నట్లు చెబుతున్న వసూళ్ల వ్యవహారం మరోసారి శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నెలవారీగా లారీకి రూ.6,500 నుంచి రూ.7,500 వరకు చెల్లించాలని కొందరు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

........(తరువాయి 2లో)

## కేబినెట్ విస్తరణకు
# మళ్లీ బ్రేక్?



- కూర్పుపై ఇంకా కొలిక్కిరాని సమీకరణాలు
- ఖాళీగా ఉన్న 3 బెర్తులు భర్తీ చేసేదెప్పుడు?
- ఢిల్లీ చర్చల్లో విస్తరణ ప్రస్తావనే లేదన్న మహేశ్
- సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే హైకమాండ్‌తో చర్చ
- మంత్రి పదవులపై కొనసాగుతున్న ఉత్కంఠ
- సీఎం నిర్ణయం కోసం కాంగ్రెస్‌లో ఎదురుచూపులు

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై మరోసారి సందిగ్ధత నెలకొంది. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న 3 బెర్తులను భర్తీ చేస్తారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. అసలు కూర్పుపై కసరత్తు పూర్తయిందా? సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కుదరడం లేదా? ఆశావహుల మధ్య పోటీతో నిర్ణయం వాయిదా పడుతోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చాయి. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని,

........(తరువాయి 2లో)

## ఎమ్మెల్సీ టికెట్లపై లాబీయింగ్!

- 2 పట్టభద్రుల స్థానాలపై ఆశావహుల కన్ను
- గవర్నర్ కోటాలో 4 బెర్తులు.. రేసులో పలువురు నేతలు
- మహబూబ్‌నగర్.. ఖమ్మం సీట్లకు పెరుగుతున్న పోటీ
- టికెట్ల కోసం అధిష్ఠానం పెద్దల చుట్టూ ప్రదక్షిణలు!



3

# రవాణా శాఖలో మరో 'వసూళ్ల' దందా!

(మొదటిపేజీ తరువాయి)

ములుగు జిల్లా మీదుగా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లాలోని జాతీయ రహదారిపై కూడా భారీగా సరుకు రవాణా జరుగుతోంది. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు రవాణా శాఖ సిబ్బంది పేరుతో లారీ యజమానులపై నెలవారీ చెల్లింపుల కోసం ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లారీకి నెలకు రూ.6,500 నుంచి రూ.7,500 వరకు ఇవ్వాలని కోరుతున్నారని, ఆ మొత్తాన్ని చెల్లించే వాహనాలను తనిఖీల సమయంలో పెద్దగా ఇబ్బందులకు గురిచేయడం లేదని పలువురు లారీ యజమానులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. అయితే నెలవారీ చెల్లింపులకు అంగీకరించని వాహనాలను మాత్రం వివిధ కారణాలతో నిలిపివేసి, భారీగా జరిమానాలు విధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? నిజంగా ఇలాంటి నెలవారీ వసూళ్లు జరుగుతున్నాయా? జరిగితే వాటి వెనుక ఎవరున్నారు? అన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.




**మధ్యవర్తుల ద్వారానే వ్యవహారం...?**

వసూళ్ల వ్యవహారంలో నేరుగా అధికారులు కాకుండా వారికి సన్నిహితంగా ఉండే ప్రైవేటు వ్యక్తులు, మధ్యవర్తుల పాత్ర ఉన్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. లారీ యజమానుల నుంచి సేకరించిన మొత్తాలు ముందుగా మధ్యవర్తుల వద్దకు చేరి, అక్కడి నుంచి సంబంధిత వ్యక్తులకు చేరుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఇందులో ఉన్నతస్థాయి అధికారులకు కూడా వాటాలు వెళ్తున్నాయన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నప్పటికీ.. వాటిని నిర్ధారించే ఆధారాలు బహిరంగంగా వెలుగులోకి రావాల్సి ఉంది. నిజంగా ఈ తరహా వ్యవహారం జరుగుతున్నట్లయితే అది ఒక్కరిద్దరు సిబ్బందికి పరిమితమయ్యే అంశం కాదని, పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని ప్రజలు అంటున్నారు.

**'టెంపరరీ' నంబర్ ప్లేట్లపై అనుమానాలు...**

ములుగు జిల్లా రవాణా శాఖకు చెందిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వాహన తనిఖీలకు వినియోగిస్తున్నట్లు చెబుతున్న కొన్ని వాహనాల నంబర్ ప్లేట్లపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెంపరరీ రిజిస్ట్రేషన్ నంబర్ల విషయంలో నిర్దేశిత నిబంధనలు పాటించాల్సి ఉండగా సంబంధిత వాహనాల్లో తెలుపు రంగు బోర్డుపై నలుపు అక్షరాలతో టెంపరరీ రిజిస్ట్రేషన్ నంబర్లు కనిపిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా టెంపరరీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లకు వర్తించే నిబంధనలు ఇక్కడ పాటిస్తున్నారా లేదా అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ములుగు జిల్లాలో ఇలాంటి టెంపరరీ నంబర్ ప్లేట్లతో రెండు వాహనాలు వాహన తనిఖీల్లో పాల్గొంటున్నాయన్న ప్రచారం ఉంది. ఆ వాహనాలు నిజంగా రవాణా శాఖ అధికారుల వినియోగంలో ఉన్నవేనా? వాటి రిజిస్ట్రేషన్ వివరాలు ఏమిటి? వాటిని ఎవరు ఉపయోగిస్తున్నారు? అన్నది కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల పేరుతో ప్రైవేటు వ్యక్తుల హల్‌చల్....?**

రవాణా శాఖ అధికారుల పేర్లు లేదా శాఖకు సంబంధించిన గుర్తింపును ఉపయోగించుకుని మరెవరైనా ప్రైవేటు వ్యక్తులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక వాహనాలు నిబంధనలకు అనుగుణంగా లేకపోతే వాటి వినియోగంపై శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ అధికారుల పేరుతో ఇతరులు వాహనాలను వినియోగిస్తూ లారీలను నిలిపి డబ్బులు వసూలు చేస్తున్నట్లయితే అది మరింత తీవ్రమైన అంశంగా మారుతుంది. ఇలాంటి వ్యవహారం నిజంగా జరుగుతున్నదా? లేక వాహనాలు అధికారికంగానే వినియోగంలో ఉన్నాయా? అన్నది వాహనాల రిజిస్ట్రేషన్, అనుమతులు, శాఖ రికార్డులు, డ్యూటీ వివరాలను పరిశీలిస్తే స్పష్టమవుతుంది.

**ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా.. మరో ఎంవీఐ ఎందుకు..?**

ములుగు రవాణా శాఖలో మరో అంశం కూడా చర్చకు దారితీస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఇద్దరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, శ్రీనివాస్ లు విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జిల్లా రవాణా అధికారితోపాటు ఈ సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ నిర్మల్ జిల్లాలో పనిచేయాల్సిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ రెడ్డి ఓడీపై ములుగు జిల్లాలో విధులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అసలు ఆయనకు ములుగులో విధులు అప్పగించడానికి కారణమేంటి? నిర్మల్ జిల్లాలో ఆయనకు ఉన్న పోస్టింగ్ కొనసాగుతుండగానే ములుగులో ఓడీ ఎందుకు ఇచ్చారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ములుగు జిల్లాలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఇసుక లారీలు, ఇతర భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, జాతీయ రహదారి విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో వాహన అనధికార తనిఖీలకు అవసరం ఉంటుందని జిల్లా రవాణా శాఖ అధికారులు కావాలని ములుగు తీసుకువచ్చారా? అదనపు అధికారి నియామకం వెనుక ప్రభుత్వ పరిపాలనా అవసరమే కారణమా? లేక మరేదైనా ఉద్దేశం ఉందా? అన్నది ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

**డీటీఓకు తెలియకుండానేనా...?**

ములుగు రవాణా శాఖలో ఇంతటి ఆరోపణలు, విమర్శలు వస్తున్న నేపథ్యంలో జిల్లా స్థాయి రవాణా అధికారి ఈశ్వర్ సింగ్ ఠాకూర్ పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లారీకి నెలకు వేల రూపాయల చొప్పున వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే అవి జిల్లా స్థాయి అధికారుల దృష్టికి రాకుండా ఎలా కొనసాగుతున్నాయి? అధికారులు గుర్తించలేదా? గుర్తించినా చర్యలు తీసుకోలేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాహన తనిఖీల సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలు, ఉపయోగిస్తున్న వాహనాల రిజిస్ట్రేషన్, డ్యూటీ చార్టులు, విధించిన జరిమానాలు, లారీ యజమానుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తే వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**కమిషనర్ స్థాయి విచారణకు డిమాండ్....**

ఇప్పటికే లాగిన్ వ్యవహారంపై వివాదం కొనసాగుతున్న సమయంలోనే తాజాగా లారీల నుంచి నెలవారీ వసూళ్ల ఆరోపణలు, అనుమానాస్పద నంబర్ ప్లేట్ల వినియోగం, ఓడీపై పనిచేస్తున్న ఎంవీఐ అంశాలు తెరపైకి రావడంతో ములుగు రవాణా శాఖపై సమగ్ర విచారణ జరపాలన్న డిమాండ్ పెరుగుతోంది. రవాణా శాఖ కమిషనర్ స్థాయి అధికారులు ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టి గత కొంతకాలంగా జిల్లాలో జరిగిన వాహన తనిఖీలు, విధించిన జరిమానాలు, అధికారుల డ్యూటీ వివరాలు, తనిఖీలకు ఉపయోగించిన వాహనాలు, వాటి రిజిస్ట్రేషన్ వివరాలు, అధికారిక లాగిన్‌ల వినియోగం తదితర అంశాలను పరిశీలించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధించి సమగ్రమైన విచారణ చేప ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలకు కోరుతున్నారు.

# కేబినెట్ విస్తరణకు మళ్లీ బ్రేక్?

(మొదటిపేజీ తరువాయి)

హైకమాండ్ నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి వస్తుందంటూ జరుగుతున్న ప్రచారం కూడా తనకు తెలియదన్నారు. దీంతో ఆదివారం కేబినెట్ విస్తరణ ఉంటుందంటూ సాగుతున్న ప్రచారానికి భిన్నమైన సంకేతాలు వెలువడ్డాయి. కేబినెట్‌లో గరిష్ఠంగాA 18 మందికి అవకాశం ఉండగా.. ప్రస్తుతం 3 బెర్తులు ఖాళీగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించిన తర్వాత ఈ ఖాళీల భర్తీపై సహజంగానే అంచనాలు పెరిగాయి. అయితే ఒక్క బెర్తును భర్తీ చేయడం మాత్రమే కాకుండా.. మిగిలిన రెండు స్థానాలకు ఎవరిని ఎంపిక చేయాలి, ఏ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రాంతాల మధ్య సమతుల్యత ఎలా సాధించాలి, పార్టీకిప్రభుత్వానికి మధ్య సమన్వయాన్ని ఎలా బలోపేతం చేయాలన్న అంశాలు కూడా కీలకంగా మారాయి. దీంతో కేబినెట్ కూర్పుపై కసరత్తు ఇంకా పూర్తికాలేదన్న అభిప్రాయం కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది.

**3 బెర్తులు.. ఇంతకీ ఎప్పుడు?**

ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులు ఎప్పుడు భర్తీ అవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఆదివారం విస్తరణ ఉంటుందని కొందరు కాంగ్రెస్ నేతలు చెబుతున్నా.. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. పైగా ఢిల్లీలో విస్తరణపై చర్చే జరగలేదని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది. హైకమాండ్ నుంచి తనకు ఎలాంటి సమాచారం లేదని ఆయన స్పష్టం చేయడంతో.. విస్తరణకు సంబంధించి ప్రచారంలో ఉన్న తేదీ, పేర్లు ఎంతవరకు వాస్తవమన్నది చర్చనీయాంశంగా మారింది. కేబినెట్ విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయమే కీలకమని మహేశ్ స్పష్టం చేశారు. విస్తరణకు ముహూర్తం ఖరారైందన్న ప్రచారం ఉన్నప్పటికీ.. కూర్పుపై తుది నిర్ణయం తీసుకోలేదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఒక్కో సామాజిక వర్గం నుంచి వస్తున్న డిమాండ్లు, పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలు, ఇప్పటికే ఉన్న మంత్రుల రాజకీయ బలం, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన నిర్ణయాలు.. ఇలా అనేక అంశాలను సమన్వయం చేయాల్సి ఉండటంతో కసరత్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. అందుకే విస్తరణ ప్రకటనకు ముందు చివరి నిమిషం వరకు సమీకరణాలను మార్చే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది.

**మహేశ్ పేరుపై మౌనం ఎందుకు?**

కేబినెట్‌లోకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను తీసుకుంటారన్న ప్రచారం చాలాకాలంగా సాగుతోంది. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడంతోపాటు డిప్యూటీ సీఎం పదవి కూడా దక్కవచ్చన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే తాజాగా స్వయంగా మహేశ్‌కుమార్‌గౌడ్ తనకు మంత్రి పదవి వస్తుందన్న విషయం తనకు తెలియదని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని ఆయన స్పష్టం చేయడంతో.. ఆయన మంత్రి పదవిపై జరుగుతున్న ప్రచారం కూడా ప్రస్తుతానికి ఊహాగానాలకే పరిమితమైంది. మహేశ్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటే టీపీసీసీ అధ్యక్ష పదవికి కొత్త నాయకుడిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీంతో ఒక మంత్రి పదవి భర్తీతోపాటు మరో కీలకమైన పార్టీ పదవి విషయంలోనూ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అదే సమయంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతగా మహేశ్‌కు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాన్ని బలోపేతం చేయాలన్న ఆలోచన ఉందన్న ప్రచారం కూడా ఉంది. కానీ ఆయన వ్యాఖ్యలతో చూస్తే.. ఈ మొత్తం కూర్పు ఇంకా తుది దశకు చేరలేదన్న అభిప్రాయం బలపడుతోంది.

**సురేఖ అంశంపైనే ఢిల్లీ చర్చ**

ఢిల్లీలో జరిగిన చర్చల్లో కేబినెట్ విస్తరణపై కాకుండా కొండా సురేఖ, జిలెల్ల చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగిందని మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ముఖ్యంగా కొండా సురేఖ విషయంలో తాను తీవ్రంగా ప్రయత్నించానని చెప్పారు. ఆమెను కాపాడేందుకు అందరం మా వంతు ప్రయత్నం చేశామని, అయితే సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదని పేర్కొన్నారు. చివరకు పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం మేరకే పరిణామాలు జరిగాయని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు చూస్తే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి కేబినెట్ విస్తరణ కంటే పార్టీకి సంబంధించిన తాజా పరిణామాలపైనే ఉన్నట్లు తెలుస్తోంది. సురేఖను తప్పించిన తర్వాత ఏర్పడిన ఖాళీని వెంటనే భర్తీ చేయాలని భావిస్తున్నారా? లేక మొత్తం కేబినెట్ కూర్పునే ఒకేసారి మార్చే ఆలోచనలో ఉన్నారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. సురేఖ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్నది కూడా సామాజిక సమీకరణాలతో ముడిపడి ఉండటంతో నిర్ణయం ఆలస్యమవుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఆశావహులు చాలామందే!**

ఖాళీగా ఉన్న 3 బెర్తుల కోసం కాంగ్రెస్‌లో పలువురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్, విజయశాంతి, గడ్డం ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒక్కో నేతకు ఒక్కో సామాజిక, ప్రాంతీయ ప్రాధాన్యం ఉండటంతో ఎవరిని ఎంపిక చేయాలన్నది అధిష్ఠానానికి అంత తేలికైన వ్యవహారం కాదన్న అభిప్రాయం ఉంది. ఒకరిని కేబినెట్‌లోకి తీసుకుంటే.. మరొక వర్గానికి సమతుల్యం కోసం మరో అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో 3 ఖాళీలకు ఎంపిక చేయాల్సిన ముగ్గురు నేతల విAషయంలో సమీకరణాలు కీలకంగా మారాయి. ఇక కేబినెట్‌లోకి వచ్చే వారితోపాటు.. ఇప్పటికే మంత్రులుగా ఉన్న కొందరి శాఖల్లో మార్పులు ఉంటాయన్న ప్రచారం కూడా ఉంది. ఒకరిద్దరిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పిస్తారన్న చర్చ కూడా సాగుతోంది. అయితే వీటిలో ఏ అంశానికీ ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. అందుకే ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకత్వం కూడా బహిరంగంగా ఖండించడం కానీ, ధ్రువీకరించడం కానీ చేయడం లేదు.

**వాయిదా పడుతుందా.. విస్తరణ?**

మంత్రివర్గ విస్తరణపై ఇప్పటికే పలుమార్లు ఊహాగానాలు వచ్చిన నేపథ్యంలో.. మరోసారి వాయిదా పడుతుందా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. విస్తరణకు తేదీ ఖరారైందని ప్రచారం సాగుతున్న సమయంలోనే టీపీసీసీ అధ్యక్షుడు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పడం దీనికి కారణం. ఒకవేళ సామాజిక, రాజకీయ సమీకరణాలు పూర్తిగా కుదరకపోతే విస్తరణను మరోసారి వాయిదా వేసే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కేబినెట్ విస్తరణ విషయంలో తన నిర్ణయాన్ని చివరి వరకు బయటపెట్టకుండా ఉంచే అవకాశం ఉందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎవరిని తీసుకోవాలి, ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి, పార్టీ పదవుల్లో ఎలాంటి మార్పులు చేయాలి అన్నదానిపై తుది కసరత్తు పూర్తయిన తర్వాతే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా.. 3 ఖాళీ బెర్తులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా కీలకంగా మారాయి. ఒక బెర్తు కొండా సురేఖ స్థానంతో ముడిపడి ఉండగా.. మిగిలిన రెండు స్థానాలు సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి. మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు విస్తరణపై ఇప్పటికీ స్పష్టత లేదన్న సంకేతాన్ని ఇవ్వడంతో.. కేబినెట్ కూర్పు ఇంకా కొలిక్కి రాలేదా? సమీకరణాలు కుదరడం లేదా? లేక చివరి నిమిషంలో రాజకీయంగా కీలకమైన మార్పులు చేయాలన్న ఉద్దేశంతోనే నిర్ణయాన్ని రహస్యంగా ఉంచారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఖాళీగా ఉన్న 3 బెర్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందన్నదే కాంగ్రెస్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# ఇనుగాలకు అవమానం

(మొదటిపేజీ తరువాయి)

పదవులు, గుర్తింపు విషయంలో నిరాశే మిగులుతోందన్న అసంతృప్తి ఇప్పటికే పార్టీ శ్రేణుల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలకు మాత్రం వరుసగా కీలక అవకాశాలు దక్కుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కుడా చైర్మన్ పదవి విషయంలోనూ ఇదే అంశం తెరపైకి రావడంతో పాత కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడినవారిని పక్కన పెట్టి కొత్తగా వచ్చినవారికి పెద్దపీట వేస్తున్నారన్న భావన బలపడితే దాని ప్రభావం భవిష్యత్ రాజకీయాలపై పడే అవకాశం ఉందని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది.

**పాత టీడీపీ నేతలే ఒక వర్గంగా?**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో టీడీపీలో పనిచేసిన పలువురు నేతలు ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఒకే వర్గంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ తాజాగా ఊపందుకుంది. వీరికి అధిష్ఠానంలోని కీలక నేతల మద్దతు ఉందని, అందుకే పార్టీ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల విషయంలో వారి మాటకు ప్రాధాన్యం లభిస్తోందన్న ఆరోపణలు కాంగ్రెస్‌లోని మరో వర్గం నుంచి వినిపిస్తున్నాయి. పదవుల పంపకంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఈ కోణంలోనే కొందరు నేతలు విశ్లేషిస్తున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతల హవా పెరుగుతోందన్న ప్రచారం, మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న నేతలకు ప్రాధాన్యం తగ్గుతోందన్న అసంతృప్తి కలిసిపోవడంతో 'అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్' వివాదం ముదురుతున్నట్లు తెలుస్తోంది. కుడా చైర్మన్ మార్పు సమయంలో కనిపించిన రాజకీయ సమీకరణాలు, మాజీ చైర్మన్ కార్యక్రమానికి దూరంగా ఉండటం వంటి పరిణామాలు ఈ చర్చకు మరింత బలం చేకూర్చాయి. ప్రచారానికి అనుగుణంగానే కీలక నేతల వ్యవహారశైలి కనిపిస్తోందని కొందరు కాంగ్రెస్ నాయకులు మండిపడుతున్నట్లు సమాచారం. పార్టీని పటిష్ఠం చేయాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు బహిరంగ చర్చకు రావడం నష్టమేనన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

**అధిష్ఠానం మద్దతు ఎవరికి?**

కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతల హవాకు అధిష్ఠానంలోని కొందరు కీలక నేతలు మద్దతుగా నిలుస్తున్నారన్న ఆరోపణలు నిజమేనా? పార్టీ కోసం పనిచేసిన పాత నేతలకు వరుసగా ఎందుకు నిరాశ ఎదురవుతోంది? పదవుల కేటాయింపులో సామాజిక, రాజకీయ సమీకరణాలే ప్రాతిపదికనా.. లేక స్థానిక నాయకుల అభిప్రాయాలకూ విలువ ఉందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు కాంగ్రెస్‌లో వినిపిస్తున్నాయి. కుడా చైర్‌పర్సన్ నియామకం, మాజీ చైర్మన్‌కు వీడ్కోలు లేకపోవడం వంటి పరిణామాలు ఒక పదవికి సంబంధించిన అంశంగానే ముగుస్తాయా.. లేక ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్‌లో పాత, కొత్త నేతల మధ్య ఉన్న అంతరాన్ని మరింత పెంచుతాయా? అన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# పాలు లేకుండానే పన్నీర్ తయారీ

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపార కార్యకలాపాలను నిలిపివేశారు. శ్రీ మహాలక్ష్మీ, అనిత డెయిరీలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, గీతా డెయిరీ, నర్మల్ డెయిరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

**భారీగా రసాయనాలు స్వాధీనం**

తనిఖీల్లో దాదాపు టన్ను లూజ్ పామాయిల్, 475 కిలోల గ్లిజరాల్ మోనోస్టియరేట్ రసాయనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు మావీస్ క్లాసిక్ ప్రీమియం కుకింగ్ క్రీమ్‌కు చెందిన 1,760 ప్యాకెట్లు, 150 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న పదార్థాల మొత్తం విలువ సుమారు రూ.7.19 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు సైతం కల్తీ ఆహార పదార్థాలతో వంట చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయని అధికారులు గుర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో కల్తీ ఆహార పదార్థాల దందా పెద్ద ఎత్తున సాగుతున్నట్లు తాజా తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల చార్మినార్ వద్ద ఓ ఫాస్ట్‌ఫుడ్ గోదాంపై హెచ్‌ఫాస్ట్ అధికారులు దాడులు నిర్వహించగా 90 లీటర్ల కల్తీ నూనె, 110 కిలోల ఫ్రైడ్ చికెన్ బయటపడింది. అదే విధంగా పాలు లేకుండానే రసాయనాలతో నెయ్యి తయారు చేస్తున్న వ్యవహారం కూడా ఇటీవల వెలుగులోకి వచ్చింది. వరుసగా కల్తీ ఆహార తయారీ కేంద్రాలు బయటపడుతున్న నేపథ్యంలో నగరంలో మరింత విస్తృతంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎవరిని పడితే వారిని పార్టీలోకి చేర్చుకోం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** మాజీ మంత్రి కొండా సురేఖ బీజేపీలో చేరనున్నారంటూ వస్తున్న ప్రచారంపై ఆ పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావు స్పందించారు. కొండా సురేఖ చేరికపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. పార్టీలో చేరికలకు సంబంధించి బీజేపీకి స్పష్టమైన విధానం ఉందని, ఎవరిని పడితే వారిని పార్టీలోకి చేర్చుకోబోమని శనివారం స్పష్టం చేశారు. కొండా సురేఖ చేరిక ప్రచారం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని మురళీధర్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొందని, ఆ అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి కథనాలను ప్రచారంలోకి తెస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాజకీయాలపై మురళీధర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న ప్రచారంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కేసీఆర్.. దమ్ముంటే అసెంబ్లీకి రా!

(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు బేరీజు వేసి చూడాలని సవాల్ చేశారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యమకారులు, పేదల కోసం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించాలని కోరారు. కొంతమంది దుర్మార్గులు, సన్నాసులు ప్రభుత్వం విఫలమైందంటూ విమర్శలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రాజీనామా చేయాలంటూ ఊరూరా తిరుగుతున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పండుగ పూట వచ్చే గంగిరెద్దుల్లా తిరుగుతూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల పాలనలో ఏం జరిగింది, తమ ప్రభుత్వం 1000 రోజుల్లో ఏం చేసిందో ప్రజలు లెక్కలు వేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన పథకాలను రద్దు చేయకుండా.. వాటిని మరింత పెంచి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

**రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు**

2014లో రూ.1 లక్ష రుణమాఫీని 4 విడతల్లో చేసి వడ్డీకే సరిపోయేలా చేశారని, రైతులను అప్పులపాలు చేశారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. 2018లో మళ్లీ రూ.1 లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి అసలు, వడ్డీ రెండింటికీ పంగనామం పెట్టారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డును అమ్ముకుని రూ.7000 కోట్లు దిగమింగారని, చివరి విడత రైతుబంధు వేయకుండా మోసం చేసి గద్దె దిగారని అన్నారు. తమ ప్రభుత్వం 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేసిందని చెప్పారు. సిద్దిపేట, సిరిసిల్ల గడ్డపై అయినా చర్చకు తాము సిద్ధమని, 32 నెలల్లో రైతుభరోసా కింద రూ.36 వేల కోట్లు అందించామని, అసెంబ్లీలో లెక్కలు తేల్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వరి వేస్తే ఉరి అన్న నాటి ముఖ్యమంత్రి వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. తమ ప్రభుత్వం 30 నెలల్లో వరి రైతుల ఖాతాల్లో రూ.90 వేల కోట్లు జమ చేసి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. సన్నవడ్లు పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇచ్చామని, 32 నెలల్లో ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. 30 నెలల్లో 70 లక్షల రైతు కుటుంబాల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. తండ్రి, కొడుకు, అల్లుడు అసెంబ్లీకి వస్తే అన్ని లెక్కలు తేల్చుదామని సవాల్ చేశారు.

**ఆడబిడ్డల కోసం కొత్త ఆర్థిక శక్తి**

అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. అమ్మవారింటికి వెళ్లినా, అమ్మవారిని దర్శించుకున్నా బస్సు చార్జీ లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించిందని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని చెప్పారు. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం ఇవ్వాలని కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తుంటే కడుపుమండి హైదరాబాద్‌లో ఆటో కార్మికులను రెచ్చగొట్టి ధర్నా చేయించారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం ఉన్నంత కాలం ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. మహిళా సంఘాలకు 1000 బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేసి నెలకు రూ.70 వేల ఆదాయం వచ్చే మార్గం కల్పించామని తెలిపారు. పెట్రోల్ బంకులు, సౌర విద్యుత్ అంటే అదానీ, అంబానీలే గుర్తుకొచ్చే పరిస్థితిని మార్చాలని, మహిళా సంఘాలతో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆడబిడ్డలతో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయిస్తున్నామని, హైటెక్ సిటీ పక్కన రూ.1000 కోట్ల విలువైన మూడున్నర ఎకరాల స్థలంలో మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఇందిరా మహిళా శక్తి స్టాళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రతి వ్యాపారంలో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. బడి పిల్లల దుస్తులు కుట్టే వ్యాపారాన్ని మహిళలకు అప్పగించామని, అమ్మ ఆదర్శ పాఠశాల బాధ్యతలను కూడా ఆడబిడ్డలకు ఇచ్చామని తెలిపారు. 67 లక్షల మహిళా సంఘాలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో ఏనాడైనా ఆడబిడ్డలను ఇంతగా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు.

**యువత ఆత్మబలిదానాలకు గౌరవం**

తెలంగాణ ఉద్యమం అంటేనే నిరుద్యోగ యువత గుర్తుకు వస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారని, యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. అయితే పదేళ్ల పాలనలో శ్రీకాంతాచారి కుటుంబాన్ని పిలిచి బుక్కెడు బువ్వ పెట్టారా అని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాలను పల్లీ బఠానీల్లా అమ్ముకుని నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడారని బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇప్పుడు ప్రజా పాలన రావాలని, తమ ప్రభుత్వాన్ని కూల్చాలని దీక్షలు చేస్తూ రోడ్లపై తిరుగుతున్నారని విమర్శించారు. రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, విద్యార్థులు, ఉద్యమకారులను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజా పాలనలో పేదలు, ఆడబిడ్డలు, ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1.06 కోట్ల రేషన్ కార్డుల పరిధిలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు కూడా సన్నబియ్యం ఇస్తున్నామని, వారు పండించిన వడ్లు కొనుగోలు చేయలేదా, రైతుభరోసా తీసుకోలేదా అని ప్రశ్నించారు. 50 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకే ఇందిరమ్మ పాలన పోవాలా అని ప్రశ్నించారు.

**కుటుంబ పాలనకు.. ప్రజా పాలనకు తేడా**

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెబుతున్నారని, అయితే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీశ్‌రావు, కేటీఆర్‌లను మంత్రులుగా చేశారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌ను మంత్రులుగా చేశానన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంతోష్‌రావును ఎంపీ చేశారని, తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎంపీ చేశానన్నారు. కేసీఆర్ హయాంలో వినోద్‌రావును ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా, కవితను ఎమ్మెల్సీగా చేశారని, తమ ప్రభుత్వంలో శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, సత్యంలను ఎమ్మెల్సీలుగా చేశామని చెప్పారు. నల్గొండ జిల్లాకు ప్రజా పాలనలో తొలిసారి 3 ఎమ్మెల్సీ పదవులు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ తన బిడ్డలు, బంధువులకు పదవులు ఇస్తే.. తాము శంకరమ్మకు, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులు ఇచ్చామని రేవంత్‌రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, జ్యోతిరావు పూలే విగ్రహాలు తమ ప్రభుత్వంలోనే వచ్చాయని చెప్పారు. కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేస్తే.. తాము బలహీన వర్గాల బిడ్డ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా చేశామని తెలిపారు. కేసీఆర్ హయాంలో పేదల బిడ్డలకు ఇలాంటి పదవులు వచ్చాయా అని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేపర్, టీవీ, ఫామ్‌హౌస్, దోచుకోవడానికి తెలంగాణను ఇచ్చారని రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అందుకే ఇప్పుడు కాకుల్లా రాష్ట్రంపై పడి మాట్లాడుతున్నారని విమర్శించారు. తనకు చదువు వచ్చిందో రాదో కానీ సంస్కారం ఉందని అన్నారు. సంస్కారం ఉంది కాబట్టే సీతక్క, కొండా సురేఖలను ఇంటికి పిలిచి రాఖీ కట్టించుకున్నానని చెప్పారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న కేటీఆర్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవన్నీ అసెంబ్లీలో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేటీఆర్ అయినా, కేసీఆర్ అయినా అసెంబ్లీకి రావాల్సిందేనని సవాల్ చేశారు.

**365 రోజులు**

**కనిపించని కేసీఆర్‌కు సవాల్**

ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు విధులకు హాజరుకాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తారని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి రూ.22.24 కోట్ల జీతం తీసుకున్న కేసీఆర్ ఒక్క రోజు కూడా బయటకు రాలేదని ఆరోపించారు. మరి ఆయన్ను డిస్మిస్ చేయాలా వద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్ తీసుకున్న జీతం పేద ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్ము కాదా అని నిలదీశారు. గతమే తప్ప భవిష్యత్తు లేని పరిస్థితి బీఆర్ఎస్‌కు వచ్చిందని, వారి భవిష్యత్తు చీకటిమయమైందని విమర్శించారు. తెలంగాణ తులసీవనంలో గంజాయి మొక్కలను పీకేస్తామని, బీఆర్ఎస్ మొక్కను మొలవనివ్వబోమని రేవంత్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల, గజ్వేల్‌లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరున సిరిసిల్లకు వస్తానని, కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత సిద్దిపేటకు వస్తానని చెప్పారు. ఎవరిని తీసుకొస్తారో తీసుకురావాలని, సిరిసిల్ల, సిద్దిపేటలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. కల్వకుంట్ల కుటుంబం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందామని కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. అసెంబ్లీ స్థానాలు పెరిగితే 117 సీట్లలోనూ, ఉన్న సీట్లే ఉంటే 90 సీట్లతోనూ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. 2024 నుంచి 2034 వరకు 2 సార్లు ఇందిరమ్మ రాజ్యం ఉంటుందని ప్రకటించారు. కేసీఆర్ సిద్ధంగా ఉంటే అసెంబ్లీకి రావాలని, లేకుంటే గౌరవంగా రాజీనామా చేసి గజ్వేల్‌లో తేల్చుకుందామని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు.

## బీఆర్ఎస్–కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తత

- **1000రోజుల కాంగ్రెస్ పాలనకు నిరసనగా భీమారంలో బీఆర్ఎస్ ర్యాలీ**
- **విద్యార్థులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన**
- **ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ శ్రేణుల ప్రయత్నం**



**కాకతీయ, హసన్‌పర్తి :** కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ సందర్భంగా హసన్‌పర్తి మండలం భీమారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భీమారం నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు విద్యార్థులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ర్యాలీకి బీఆర్ఎస్‌కు పెరుగుతున్న మద్దతును తట్టుకోలేక కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. ర్యాలీని అడ్డుకునే క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి ప్రయత్నించారని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నట్లు తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## చిన్న ముప్పారంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**కాకతీయ, ఇనుగుర్తి:** మండలంలోని చిన్న ముప్పారం గ్రామంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయలి భవాని శేఖర్, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ శ్రీ సుజాత ఆధ్వర్యంలో జరిగిన శిబిరానికి వివిధ ఆరోగ్య సమస్యలతో సుమారు 300 మంది హాజరయ్యారు. వైద్యులు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో అందిస్తున్న ఆయుర్వేద వైద్య సేవలు, మందులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లం ఐలయ్య, నామాల మహేష్, వార్డు సభ్యులు ఎల్లబోయిన పద్మ, లావణ్య, స్వరూప, గ్రామస్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా 13 మంది ఎంపిక

**ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానం**



**కాకతీయ, ఇనుగుర్తి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ ఇనుగుర్తి పాఠశాలలో మండల ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓ వి. వెంకట్‌రెడ్డి అధ్యక్షతన, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూరం భాస్కర్‌రెడ్డితో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, మాధవ్, వీరన్న, మధుబాబు, మల్లయ్య, రేవతి, సారంగపాణి, యుగంధర్, స్వాతి, అమృతలక్ష్మి, శైలజ, నాగవాణి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు భాస్కర్, వీరన్న, రమేష్, మధుబాబు, ప్రభాకర్, ఉప్పలయ్యతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వే నిష్పక్షపాతంగా పూర్తి చేయాలి

- **పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలి**
- **రైతుల సందేహాలు, అభ్యంతరాలను పరిష్కరించాలి**
- **ఆర్డీవో టి. సుమ ఆదేశం**



**కాకతీయ, రాయపర్తి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని ఆర్డీవో టి. సుమ అధికారులను ఆదేశించారు. శనివారం కొండాపురంలో జరుగుతున్న రీసర్వేను ఆమె పరిశీలించారు. సర్వే రికార్డులు, సరిహద్దు వివరాల సేకరణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి సర్వే తీరుపై ఆరా తీశారు. భూముల రీసర్వే రైతుల హక్కులు, భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి సంబంధించిన సున్నితమైన అంశమని ఆమె అన్నారు. సరిహద్దుల నిర్ధారణ, వివరాల నమోదులో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులు సరైన పత్రాలు సమర్పించి సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, సర్పంచ్ కనుకుంట్ల మంజుల అశోక్, జీపీఓ రమేష్, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రేవంత్‌తో వ్యక్తిగత వైరం లేదు

- **ఒకట్రెండు అంశాల్లోనే అభిప్రాయ భేదాలు వచ్చాయి**
- **మునుగోడుకు కొడంగల్, మధిర స్థాయిలో రూ.2 వేల కోట్ల నిధులు**
- **త్వరలో సీఎం సభకు వేలాది మంది కార్యకర్తలతో వెళ్తా**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

**కాకతీయ, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో పలుమార్లు విమర్శలు చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తాజాగా తన వైఖరిపై స్పష్టత ఇచ్చారు. తాను రేవంత్‌రెడ్డిని ఎప్పుడూ దూషించలేదని, ఒకట్రెండు అంశాల్లో మాత్రమే అభిప్రాయ భేదాలు వచ్చాయని తెలిపారు. రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి వ్యక్తిగత వైరం లేదని స్పష్టం చేశారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించడంపై రాజగోపాల్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం నియోజకవర్గం మధిర స్థాయిలోనే మునుగోడు నియోజకవర్గానికి కూడా సుమారు రూ.2 వేల కోట్ల నిధులు వచ్చాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తున్న నేపథ్యంలో తాను కూడా సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలిపారు.

**సీఎం సభకు భారీగా తరలివెళ్తా**

రేవంత్‌రెడ్డితో తనకు వ్యక్తిగత విభేదాలు లేవని మరోసారి స్పష్టం చేసిన రాజగోపాల్‌రెడ్డి.. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. త్వరలో మునుగోడులో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలతో తరలివెళ్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి తీరుపై గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాజగోపాల్‌రెడ్డి తాజా ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# డ్రగ్స్ నిర్మూలనకు సంఘమిత్ర వారధి

- **పోలీసులు, ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటా అవగాహన**
- **ప్రతి తల్లి చైతన్యవంతమైతే.. ప్రతి కుటుంబం సురక్షితం**
- **1.17 లక్షల మందితో డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి శ్రీకారం**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత**



**కాకతీయ, హనుమకొండ :** డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని శనివారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభించారు. పోలీస్ శాఖతో పాటు మహిళా సంఘాలు, ప్రజలను భాగస్వాములను చేసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఎస్‌హెచ్‌జీలు, గ్రామ దీపికలు (వీఓఏలు), మెప్మా సభ్యుల ద్వారా సుమారు 1.17 లక్షల మందికి డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించి, వారి ద్వారా జిల్లాలోని ప్రతి కుటుంబానికి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై సందేశాన్ని చేరవేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి మహిళా సంఘం సభ్యురాలు సంఘమిత్రగా పనిచేస్తూ యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు కుటుంబాల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులు సూచించారు.

**తల్లులు పిల్లల ప్రవర్తనను గమనించాలి**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి తల్లి తన పిల్లల ప్రవర్తనను గమనిస్తూ, మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయం, సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారదాతల వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు విలువైన సమాచారం అందించిన వారికి తగిన రివార్డు అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ డ్రగ్స్ సమస్య కేవలం పోలీస్ శాఖకు సంబంధించినది కాదని, సమాజం మొత్తం కలిసి ఎదుర్కోవాల్సిన సమస్య అని అన్నారు. యువతను సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులు, కుటుంబాలు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ సంఘమిత్రలో భాగస్వాములైన ప్రతి సభ్యురాలు తన గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించే సైనికురాలిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో డ్రగ్స్ వ్యసనం నుంచి బయటపడి సాధారణ జీవితంలోకి వచ్చిన వ్యక్తి తన అనుభవాలను పంచుకున్నారు. డ్రగ్స్ వల్ల తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరిస్తూ యువత ఎవరూ వాటికి బానిసలు కావొద్దని సూచించారు. విద్యార్థినులు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన స్కిట్ ప్రదర్శించారు. ముఖ్యమంత్రి, డీజీపీ, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో అధికారుల డ్రగ్స్ వ్యతిరేక సందేశాల వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్, పీడీ డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా వైద్యాధికారి రాజిరెడ్డి, మామునూరు ఏసీపీ వెంకటేష్, గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ భరత్, మహిళా సంఘాల ప్రతినిధులు, వెయ్యికి పైగా ఎస్‌హెచ్‌జీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

- **రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఏఐ మౌలిక వసతుల ప్రాజెక్టు**
- **250 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ క్యాంపస్**
- **ఏఐ విప్లవంలో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలబెడతాం**
- **ప్రత్యక్షంగా, పరోక్షంగా 7 వేల ఉద్యోగాల కల్పన**
- **ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడింది**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**కాకతీయ,తెలంగాణబ్యూరో :** తెలంగాణకే కాకుండా దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం తన కలను సాకారం చేసిందని తెలిపారు. హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ హైపర్ వాల్ట్ మధ్య శనివారం అవగాహన ఒప్పందం కుదిరింది. సచివాలయంలో టీసీఎస్ హైపర్ వాల్ట్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు వివరాలను సీఎంకు వివరించారు. హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైపర్ వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ కోసం దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయని చెప్పారు. ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

**ప్రపంచ ఏఐ సంస్థలకు భారీ కంప్యూటింగ్ వసతులు**

ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుందని సీఎం తెలిపారు. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ మౌలిక వసతుల క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలకమైన ప్రజా మౌలిక వసతులుగా మారనున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. అలాంటి అత్యున్నత కంప్యూటింగ్ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను అభినందించారు. ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**ఫ్యూచర్ సిటీకి బలమైన పునాది**

టీసీఎస్ తీసుకున్న నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. తాను ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టుతో బలమైన పునాది పడిందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. టీసీఎస్ సీఈవో కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సీఈవో, ఎండీ దీపేష్‌నందా హాజరయ్యారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్‌ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ టికెట్లపై లాబీయింగ్!



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్‌లో అప్పుడే సందడి మొదలైంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే ఆశావహులు టికెట్ల కోసం లాబీయింగ్ ముమ్మరం చేస్తున్నారు. త్వరలో 2 పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు 4 గవర్నర్ కోటా స్థానాలు ఖాళీ కానుండటంతో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చ పార్టీలో జోరందుకుంది. ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా ఉన్న సురభి వాణీదేవి, చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఆయా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై నాయకత్వం దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆశావహులు ఇప్పటి నుంచే తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం.

**పాలమూరు సీటుపై హోరాహోరీ**

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం సామ రామ్మోహన్‌రెడ్డి, గాలి హర్షవర్ధన్, బి.వేణుగోపాల్, గౌరీశంకర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గం కావడంతో పార్టీ గుర్తుతోపాటు వ్యక్తిగత పరిచయాలు, విద్యావంతులు, ఉద్యోగ వర్గాల్లో ఉన్న పట్టు అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేయనున్నాయి. దీంతో ఎవరికి టికెట్ దక్కితే పార్టీని సమర్థంగా నడిపించగలరన్న అంశంపై నాయకత్వం అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, గెలుపు అవకాశాలే ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

**ఖమ్మం సీటుపైనా పోటీ**

ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. గుత్తా అమిత్‌రెడ్డి, పున్న కైలాశ్‌నేత, చనగాని దయాకర్, లోక్ యాదవ్ తదితరుల పేర్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఆయా నేతలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే తమకు అనుకూలంగా ఉన్న ముఖ్య నేతల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాల పరిధి ఎక్కువగా ఉండటంతో సంస్థాగతంగా పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, ఉద్యోగులు-పట్టభద్రులతో సంబంధాలు వంటి అంశాలను నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ సీటుపై కూడా ఇప్పటి నుంచే పోటీ మొదలైంది.

**గవర్నర్ కోటాలో ఎవరికి ఛాన్స్?**

నవంబరు, డిసెంబరులో 4 గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండటంతో నామినేటెడ్ పదవులపై కూడా కాంగ్రెస్ నేతల్లో ఆశలు పెరిగాయి. పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతలతోపాటు వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయోధ్య రెడ్డి, సత్తు మల్లేశ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా రాజకీయ వర్గాల్లో గుర్తింపు ఉన్న బస్వరాజు సారయ్య పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చినట్లు సమాచారం.

## కేబినెట్ విస్తరణపై సమాచారం లేదు

- **ఢిల్లీలో విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదు**
- **కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ**
- **సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించా**
- **రాబోయే 100 రోజులు బీసీ హక్కుల గర్జన**
- **కులగణనలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్**
- **టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కేబినెట్ విస్తరణపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని, హైకమాండ్ నుంచి కూడా తనకు ఎలాంటి సమాచారం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇష్టమని చెప్పారు. తనకు మంత్రి పదవి వస్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మీడియా చిట్‌చాట్‌లో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. ఢిల్లీలో జరిగిన చర్చల్లో కేవలం కొండా సురేఖ, జిల్లెల్ల చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగిందని తెలిపారు. కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. కొండా సురేఖ విషయంలో తాను తీవ్రంగా ప్రయత్నించానని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఆమెను కాపాడేందుకు అందరం మా వంతు ప్రయత్నం చేశామని చెప్పారు. అయితే సురేఖ విషయంలో ఏఐసీసీ ఒప్పుకోలేదని వ్యాఖ్యానించారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే పరిణామాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ఆశయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించామని చెప్పారు. బీసీల హక్కుల కోసం రాబోయే 100 రోజులు దేశవ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీలకు పిలుపునిచ్చారు.

**బీజేపీ బీసీ నేతలు నోరు విప్పాలి**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీసీల అంశంపై బండి సంజయ్, అరవింద్, ఈటల రాజేందర్, లక్ష్మణ్ స్పందించాలని కోరారు. పదవులు పోతాయనే భయంతో బీజేపీకి చెందిన బీసీ నేతలు ఈ అంశంపై నోరు మెదపడం లేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఉండాలో వద్దో ఆ పార్టీకి చెందిన బీసీ నేతలే తేల్చుకోవాలని అన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని పొన్నం ప్రభాకర్ చెప్పారు. కులగణనలో అన్ని అంశాలను పొందుపరిచామని తెలిపారు. కేంద్రానికి పంపిన ఫైల్‌పై ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదని, ఓబీసీల జనాభాను ఎందుకు లెక్కించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా తెలంగాణలో ఆదివారం కేబినెట్ విస్తరణ జరగనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు వార్తలు వస్తున్నాయి. కేబినెట్‌లో గరిష్ఠంగా 18 మంది మంత్రులకు అవకాశం ఉండగా ప్రస్తుతం 3 బెర్తులు ఖాళీగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ 3 మంత్రి పదవుల కోసం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, విజయశాంతి, గడ్డం ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే విస్తరణపై హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేయడం ఈ ప్రచారానికి భిన్నంగా ఉంది.

# హామీల పేరుతో కాంగ్రెస్ నయవంచన

- **విద్యార్థులు, యువత జీవితాలను నట్టేట ముంచింది**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజం**



**కాకతీయ, తొర్రూరు:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా నాలుగో రోజు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్, యువత, విద్యార్థుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాలకు చెందిన యువత, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను నట్టేట ముంచి హామీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన చేసిందని ఆరోపించారు. విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల గ్యారంటీ కార్డు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లను సైతం పూర్తి చేయలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. విద్యార్థులకు కనీసం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

**కేసీఆర్ హయాంలోనే విద్యార్థులకు అండ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి విద్యార్థుల భవిష్యత్తును ఆగమ్యగోచరంగా మార్చిందని ఎర్రబెల్లి ఆరోపించారు. విద్యార్థులు, యువత పట్ల స్పష్టమైన విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు అవుతున్నా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారని ఆరోపించారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో వృద్ధుల పెన్షన్‌ను రూ.500 నుంచి రూ.2,000కు పెంచడంతో పాటు ఒంటరి మహిళలకు కూడా రూ.2,000 పెన్షన్ ఇచ్చామని, వికలాంగులకు రూ.4,000 పెన్షన్ అందించామని ఎర్రబెల్లి గుర్తుచేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసింది, చేసేది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. కాంగ్రెస్ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించేందుకు మరో రెండేళ్లు మాత్రమే ఉందని, ఆ తర్వాత మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల బీఆర్ఎస్ నాయకులు, యువత, విద్యార్థులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఉత్తరం కాకతీయ WWW.KAKATIYANEWS.COM

# ప్రజలకు మిగిలింది మోసమే

- కాంగ్రెస్ హామీలు గాలిలో కలిసాయి
- వాగ్దానాలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏమయ్యాయి?
- మహిళలకు రూ.2,500.. వృద్ధులకు రూ.4,000 హామీలు ఎక్కడ?
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ధ్వజం




**కాకతీయ, భూపాలపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకున్న తర్వాత ప్రజలను మర్చిపోవడం ప్రజాస్వామ్య పాలన కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ యూత్, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరసన కార్యక్రమానికి ముందుగానే పోలీసులకు సమాచారం ఇచ్చామని, పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిర్వహిస్తామని స్పష్టం చేసినప్పటికీ బీఆర్ఎస్ నాయకులను థియేటర్‌లో నిర్బంధించి బయటకు రాకుండా భారీగా పోలీసులను మోహరించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని గండ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిందని, దానిని అడ్డుకునే అధికారం ఎవరికీ లేదన్నారు. బీఆర్ఎస్ ఎక్కడ కార్యక్రమం నిర్వహిస్తే అక్కడ అధికార పార్టీ పోటీ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సరికాదని, పోటీగా సభలు పెట్టడం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పోటీ పడాలని సూచించారు.

**నిరుద్యోగులు, విద్యార్థుల హామీలపై నిలదీత**

జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం రాకపోతే నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గండ్ర గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను గత ప్రభుత్వాలు అమలు చేశాయని, ప్రస్తుత ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఆగస్టు 15లోగా ఫీజు బకాయిలు చెల్లిస్తామని హైకోర్టుకు ప్రభుత్వం హామీ ఇచ్చినా గడువు దాటినా చెల్లింపులు జరగలేదన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలు టీసీలు ఇవ్వడం లేదని, బీఏ నుంచి ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంసీఏ వరకు చదువుకున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెన్షన్లు పెంచాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

**భూ సమస్యలు, సింగరేణి కార్మికులపైనా విమర్శలు**

భూభారతి పేరుతో తీసుకొచ్చిన మార్పులతో రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గండ్ర ఆరోపించారు. 22ఏ నిబంధనను తక్షణమే రద్దు చేసి పేద రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గతంలో మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించామని, ప్రస్తుతం మెడికల్ బోర్డుల ద్వారా అర్హులైన వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతూనే ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని గండ్ర విమర్శించారు. కోట్ల రూపాయల అప్పులు తెచ్చి భూపాలపల్లికి కొత్తగా ఏం చేశారని ప్రశ్నించారు. భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయడం, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, డిగ్రీ కళాశాల తీసుకురావడం, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడం, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం నిజంగా అభివృద్ధి చేసి ఉంటే స్వాగతిస్తానన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ఇచ్చిన హామీల అమలుపై అంబేద్కర్ సెంటర్‌కు రావాలని, మీడియా సమక్షంలో బహిరంగ చర్చకు తాను సిద్ధమని గండ్ర సవాల్ విసిరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతుల భూ సమస్యలు, సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసింది
- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి
- జాబ్ క్యాలెండర్‌తోపాటు పెండింగ్ బకాయిలు చెల్లించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**కాకతీయ, నర్సంపేట టౌన్:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పాలనపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం నర్సంపేట చౌరస్తాలో విద్యార్థులు, యువతతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు పార్టీ పరిశీలకుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హాజరయ్యారు. జాబ్ క్యాలెండర్, స్కూటీలు, యూత్ డిక్లరేషన్, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా కార్డు వంటి హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును పట్టించుకోకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

**జీఓ 97ను రద్దు చేయాలి**

యూత్ డిక్లరేషన్ పేరుతో యువతకు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడం లేదని బీఆర్ఎస్ పరిశీలకుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే జీఓ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడొద్దు
- పేద విద్యార్థుల చదువుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కీలకం
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్




**కాకతీయ, హనుమకొండ :** విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వారి విద్యకు ఆటంకం కలిగించేలా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచడం సరికాదని మాజీ చీఫ్‌విప్, మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడొద్దని హెచ్చరించారు. హనుమకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన సందర్భంగా విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఏకశిలా పార్క్ ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్మృతివనం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన, ధర్నా చేపట్టారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, జీవో 97ను రద్దు చేయాలని నినదించారు.

**చదువుకు ఆటంకం కలిగించొద్దు**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతో కీలకమని వినయ్ భాస్కర్ అన్నారు. నిధులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థుల చదువులు, కళాశాలల్లో ప్రవేశాలు, పరీక్షలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాలని, పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేసి వారి విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని వినయ్ భాస్కర్ అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యావేత్తలు, సంబంధిత వర్గాలతో చర్చించి వారి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్య సాంకేతిక విద్యలో కీలకమైన భాగమని, వేలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఈ విద్యపై ఆధారపడుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ విద్యార్థుల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు.

**ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం**

విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఓరుగల్లు గడ్డపై పోరుబాట చేపట్టాల్సి వచ్చిందని వినయ్ భాస్కర్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయడంతో పాటు జీవో 97ను రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, వారి సమస్యల పరిష్కారం కోసం మరింత ఉధృతంగా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమానికి వస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వారు కార్యక్రమానికి సంఘీభావం తెలిపి ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత హక్కుల విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## యువతను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజం
- కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట
- పరకాలలో భారీ ర్యాలీ.. అంబేద్కర్ సెంటర్‌లో ఉద్రిక్తత
- పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం




**కాకతీయ, పరకాల:** ఎన్నికల ముందు యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు పరకాల పట్టణంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగి తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీకి సంఘీభావం తెలిపారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

**విద్యార్థులను అడ్డుకోవడంపై ఆగ్రహం**

ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అడ్డుకోవడం చేతగాని పాలనకు నిదర్శనమని విమర్శించారు. ధర్నాను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో బీఆర్ఎస్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి తోపులాటకు దారితీయడంతో అంబేద్కర్ సెంటర్‌లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, యూత్ కమిషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిందని, వాటి అమలు ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం వంటి హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో విద్యారంగానికి పెద్దపీట వేశామని, గురుకులాలు, జూనియర్ కళాశాలల సంఖ్యను పెంచడంతో పాటు 'మన ఊరు-మన బడి', 'మన బస్తీ-మన బడి' కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేశామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, విశ్వవిద్యాలయాల బలోపేతం చేపట్టామని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందించామని గుర్తు చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ, యువజన నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి బకాయిలను వెంటనే చెల్లించాలి

- కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- కనీస పనిముట్లు, భద్రతా పరికరాలు అందడం లేదు
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

**కాకతీయ, భూపాలపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. శనివారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని 8 ఇంక్లైన్ వద్ద బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస పనిముట్లు, నాణ్యమైన భద్రతా పరికరాలు, షూస్ కూడా సక్రమంగా అందడం లేదన్నారు. కార్మికుల సంక్షేమం కంటే రాజకీయ జోక్యం, టెండర్లు, ఆర్థిక వ్యవహారాలపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండేళ్లుగా డీఎంఎఫ్‌టీ నిధులు సక్రమంగా అందడం లేదన్నారు. కార్మికుల సమస్యలను ప్రశ్నిస్తే అడ్డుకోవడం, భయపెట్టడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. తన గొంతును అడ్డుకున్నా కార్మికుల సమస్యలపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు. తప్పులను సరిదిద్దకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## విద్యార్థులను మోసగించిన కాంగ్రెస్

- జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీల విస్మరణ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా గోస పెడుతున్న ప్రభుత్వం
- జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి : మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్
- వర్ధన్నపేట గడ్డపై కదం తొక్కిన విద్యార్థి లోకం.. భారీ ర్యాలీ



**కాకతీయ, వర్ధన్నపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తయినా యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ విమర్శించారు. బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా 4వ రోజు భీమారం జంక్షన్ నుంచి ఎర్రగట్టుగుట్ట జంక్షన్ వరకు విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ఆయన భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించారని, దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించాయని ఆయన అన్నారు. పోలీసులు భారీగా మోహరించడంతో భీమారం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు**

ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో యువత, విద్యార్థుల భవిష్యత్తును మారుస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా వాటిని అమలు చేయలేదని అరూరి రమేష్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.11,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ర్యాలీకి స్వచ్ఛందంగా హాజరయ్యేందుకు సిద్ధమైన విద్యార్థులు రాకుండా కాంగ్రెస్ నాయకులు కళాశాలలపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని, లేకపోతే విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, కేసులకు భయపడవద్దని, పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అరూరి రమేష్ అన్నారు.

## విగ్రహ గద్దె కూల్చివేత దుర్మార్గం

- పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేసి తీరుతాం
- పరకాల, రామప్ప ప్రాజెక్టుల కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



**కాకతీయ, నర్సంపేట టౌన్ :** పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కోసం అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గద్దెను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లో గద్దె కూల్చివేసిన ప్రాంతాన్ని ఆయన సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విగ్రహ ఆవిష్కరణను అడ్డుకోవడం వెనుక కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉందని ఆరోపించారు. ప్రజలు, అభిమానులు పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటుంటే రాజకీయ కక్షతో అడ్డుకోవడం సరికాదన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి గద్దె నిర్మాణాన్ని కూల్చివేయడం దారుణమన్నారు. నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఇతర విగ్రహాలకు ఏ విధమైన అనుమతులు ఉన్నాయో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి**

పాకాల, రామప్ప ప్రాజెక్టుల ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు పెద్ది సుదర్శన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని దయాకర్‌రావు పేర్కొన్నారు. మెడికల్ కళాశాలను తీసుకురావడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా అభిమానులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే అడ్డంకులు సృష్టించడం తగదన్నారు. ఎన్ని ఆటంకాలు కల్పించినా అశోక్‌నగర్‌లో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తీరుతామని దయాకర్‌రావు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాలకు పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతామని కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దయాకర్‌రావు ఆరోపించారు. ఈ చర్యలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు ఎవ్వరినీ వదిలిపెట్టబోమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం

- విద్యార్థులు, నిరుద్యోగులతో చెలగాటం
- మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ధ్వజం



**కాకతీయ, నెల్లికుదురు:** వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ విమర్శించారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమరభేరిలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులైనా ఒక్క హామీకి అతీగతి లేదన్నారు. రేవంత్‌రెడ్డి మెడలు వంచి గ్యారంటీలను అమలు చేయించడమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. విద్యార్థులకు భరోసా కార్డులు, ఆడపిల్లలకు స్కూటీలు, రెండు లక్షల ఉద్యోగాల హామీలను విస్మరించారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నిరుద్యోగులకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ హామీలను అమలు చేయలేదన్నారు. పోటీ పరీక్షల ఫీజులు పెంచారని విమర్శించారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలపై లాఠీచార్జి చేయిస్తున్నారని ఆరోపించారు. వెయ్యి గురుకులాలను నిర్వీర్యం చేసి, 30 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించే కుట్ర జరుగుతోందన్నారు. 137 మంది గురుకుల విద్యార్థుల మృతికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెన్నకుల శ్రీను, మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్‌రావు, ఆదిరెడ్డి, బానోత్ భీముడు, బత్తిని అనిల్, బిక్కు నాయక్, ఆకుల జగ్గయ్య, నజీర్ అహ్మద్, యాకూబ్‌రెడ్డి, ఎండి షరీఫ్, యూత్ అధ్యక్షుడు అశ్విన్, రెహమాన్, బానోతు బొజ్య, అశోక్, వెంకటేష్, సర్పంచులు, వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266